# దారి తప్పిన మనసు

యస్సేరావ్

గదిలో ఓ మూల వాలు కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు శేషగిరి. అతని కళ్ళు చెమ్మగిల్లి ఉన్నాయి. అతని మనసు తీవ్రమైన ఆవేదనకు గురి అయి ఉంది. ఏవేవో జ్ఞాపకాలు అతణ్ణి బాధిస్తున్నాయి. అతని అంతరంగంలో ఒక విధమైన అలజడి రేగింది.

బరువుగా ఒకసారి నిట్టూర్చి సిగరెట్టు తీసి వెలిగించాడు శేషగిరి. కసిగా నాలుగు దమ్ములు లాగి, చేతిలో ఉన్న డైరీ తెరిచాడు. డైరీలోని అక్షరాలు అతని కంటికి మసక మసకగా కనిపించాయి. చీకటి పడి చాలసేపయింది. అప్పటికి గాని అతనికి గుర్తు రాలేదు. ఇంతసేపూ అలుముకున్న చీకటిని చూశాక జీవంలేని నవ్వొకటి అతని పెదవులమీద వెలిసి మాయమయింది. మెల్లగా కుర్చీలో నుండి లేచి, నీరసంగా గోడదగ్గరకు వెళ్ళి లైటు వేశాడు.

ట్యూబులైటు వెలుగు నిండిన ఆ గది ఏ మూల చూసినా అస్తవ్యస్తంగా ఉంది. శేషగిరి కుర్చీ దగ్గర నేలమీద లెక్కలేనన్ని సిగరెట్టు పీకలు, అగ్గిపుల్లలు పడి ఉన్నాయి. అతనికి ఎదురుగా కనిపిస్తున్న పెద్ద బీరువా ఒకటి తెరిచి ఉంది. అందులో భద్రంగా ఉండవలసిన కళ్యాణి చీరలు, నగలు నేలమీద చిందర వందరగా పడేసి ఉన్నాయి. పెళ్ళయిన కొత్తలో శేషగిరి, కళ్యాణి కలిసి తీయించుకున్న కేబినెట్ సైజు ఫోటో ఒకటి శేషగిరి కాళ్ళ దగ్గర పడి ఉంది. కళ్యాణి ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న నెమలి పింఛం రంగు సిల్కు చీర మడతలు విడిపోయి క్రింద పడి ఉంది. అక్కడే నేలమీద ఎన్నోసార్లు కళ్యాణి మృదువైన కంఠాన్ని అలంకరించిన రత్నాల నెక్లెస్ కూడా పడి ఉంది. వాటి కేసి ఓ క్షణం నిర్లిప్తంగా చూసి చేతిలో ఉన్న డైరీ తెరిచాడు శేషగిరి.

పెళ్ళికి ముందు కాలేజీలో చదువుకునే రోజుల్లో సరదాగా రాసుకున్న డైరీ అది. ఆమెకు డైరీ రాసుకోవాలనే ఆలోచన కలిగింది కూడా ఆ ఏడాదే! ఇంతముందు ఆ డైరీ అంతా కళ్యాణి తన ఫ్రెండ్స్ సుధ, లలితలతో గడిపిన సంఘటనలతో నిండి ఉంది. వాళ్ళు ముగ్గురు సరదాగా గడిపిన సాయంత్రాలు, చెప్పుకున్న జోకులు, చదివిన పుస్తకాలు, చూసిన సినిమాలు— ఇవే డైరీలో చాలా భాగాన్ని ఆక్రమించాయి. శేషగిరికి కావలసిన సమాచారం ఆ డైరీలో దొరకలేదు.

మళ్ళీ ఓ సిగరెట్టు వెలిగించి మరో డైరీ తెరిచాడు శేషగిరి. ఒక్కొక్క పేజీ చదువుతూ వెడుతున్న అతను అకస్మాత్తుగా ఒక చోట ఆగాడు. అతని దృష్టిని అంతగా ఆకట్టుకున్న ఆ పేజీలోని వాక్యాలు ఇవి:

అక్టోబర్—9

'ఈరోజు లలిత ద్వారా ఒక నిజం తెలిసింది. సుధ కాలేజీలో ఎవరికో మనసిచ్చి మోసపోయిందట. అతను మనసు మార్చుకుని ఇప్పుడు మరో అమ్మాయితో తిరుగుతున్నాడట. సుధ ఈరోజు కాలేజీకి రాకుండా ఏడుస్తూ ఇంట్లో కూర్చుంది. సాయంత్రం నేను, లలిత కలిసి సుధ ఇంటికి వెళ్ళి ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పాం.

ప్రేమ అనే పదానికి విలువ లేకుండా పోతూంది. మగవాళ్ళ మీద ఎప్పుడూ రానంత కోపం వచ్చింది ఈ రోజు. పొరపాటున కూడా ప్రేమలో పడకూడదని లలిత, నేను ఒట్టు వేసుకున్నాం.'

చేతిలో ఉన్న డైరీ మూసి శూన్యంలోకి చూశాడు శేషగిరి. అతని ఆలోచనలు గతంలోకి మళ్ళిపోయాయి.

ఆ రాత్రి గది అంతా లేత నీలిరంగు కాంతితో వెలిగిపోతూంది. నీలి రంగు పొగరూపంలో అగరు వత్తుల పరిమళం గదినిండా వ్యాపించింది. తెల్లని పరుపు మీద వెదజల్లిన మల్లెపూలు మనసుని మత్తెక్కిస్తున్నాయి. కిటికీలోనుండి గదిలోకి వీస్తున్న గాలి చల్లగా, హాయిగా ఉంది.

అప్పుడే గదిలో అడుగు పెట్టిన కళ్యాణిని చూశాక శేషగిరి కన్నులు ఆనందంతో మెరిశాయి.

పసుపురంగంచు తెల్లని వాయిల్ చీరలో, జడనిండా మల్లెలు తురుముకొని, ఆ లేత నీలిరంగు కాంతిలో అందంగా మెరిసిపోతూంది కళ్యాణి. చేతిలో ఉన్న పాలగ్లాసు శేషగిరికి అందించి అతని ముందు బిడియంగా నిలుచుంది ఆమె. అతిలోక సుందరీమణుల సౌందర్యాన్ని గుర్తుకి తెచ్చే అందాలన్నీ ఆమెలో కనిపించాయి శేషగిరికి.

తన ఎదుట నిలబడి ఉన్న భార్యను కాసేపు పరికించి చూసిన మీదట శేషగిరికి ఒక విచిత్రమైన ఆలోచన కలిగింది.

కాలేజీలో చదివే రోజుల్లో శేషగిరి కళ్యాణిలాంటి అందమైన అమ్మాయిల్ని చాలా మందిని చూశాడు. వాళ్ళలో తన కంటికి నచ్చిన కొంతమందిని అతను ప్రేమించాడు. తియ్యటి మాటలు చెప్పి, తేలిగ్గా వలలో వేసుకుని, తనివి తీరా అనుభవించి వదిలివేశాడు. వాళ్ళలో చాలామంది పెళ్ళిళ్ళు చేసుకుని ఇప్పుడు హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. వాళ్ళ పాత జీవితం తెలియని ఆ అమాయకపు భర్తలు తమ భార్యలు పతివ్రతలని మురిసిపోతున్నారు...పూర్ హస్బెండ్స్!

అంతసేపూ కళ్యాణి అందాన్ని చూస్తూ ఉన్న శేషగిరికి అటువంటి అనుమానం కలిగింది. ఆ భర్తల లాగే తను కూడా కళ్యాణి విషయంలో మోసపోయాడేమో....

తను ప్రేమించి అనుభవించిన అమ్మాయిలందరికన్నా కళ్యాణి అందంగా ఉంటుంది. అంత అందంగా ఉన్న కళ్యాణిని ఏ మగాడైనా కోరుకోవడం సహజమే. తన లాంటి రోమియోలు కాలేజీలో చాలా మంది ఉంటారు. వాళ్ళలో కొంత మంది అయినా కళ్యాణి ప్రేమ కోసం ప్రయత్నాలు చేసి ఉంటారు. కళ్యాణి వాళ్ళందరిలో తనకు బాగా నచ్చిన ఒకర్ని ప్రేమించి ఉండవచ్చు. ఆ తరవాత వాళ్ళిద్దరి మధ్య జరగరానిది చాలా జరిగి ఉండవచ్చు.

క్షణంలో శేషగిరి మనసు ఏవేవో ఊహించింది. రంగు రంగుల నీడలేవో కాసేపు అతని కళ్ళ ముందు కదిలి మాయమయ్యాయి.

శేషగిరి ముఖంలోని భావాలు వెంటనే మారిపోయాయి. అతని పెదవుల మీద బలవంతంగా తెచ్చిపెట్టుకున్న నవ్వొకటి నిలిచింది. తన దగ్గర్లోనే నిలుచున్న భార్యను అమాంతం కౌగిట్లోకి తీసుకున్నాడు. ఆమె కళ్ళలో మెరుస్తున్న ఆత్రుతని కాసేపు కన్నార్పకుండా చూశాడు. ఆమె లేత బుగ్గలను రెండు చేతులతో ప్రేమగా నిమిరాడు. ఆమె జడలో గుబాళిస్తున్న మల్లెపూవుల వాసన ఎంతోసేపు చూస్తూ ఉండిపోయాడు.

భర్త అనురాగానికి కళ్యాణి మనసు పులకించిపోయింది. అతని మెడ చుట్టూ చేతులు వేసి లతలా అల్లుకుపోయింది.

శేషగిరి ఆమెను ఇంకా దగ్గరగా తీసుకుని, "కళ్యాణీ." అని ఎంతో ప్రేమగా, లాలనగా పిలిచాడు.

"ఊఁ" అంది కళ్యాణి అతని భుజం మీద మత్తుగా వాలిపోతూ.

"నువ్వు కోపగించుకోనంటే నిన్నొక విషయం అడగాలనుంది." ధైర్యం చేశాడు శేషగిరి.

"అదేమిటో త్వరగా అడగండి, బాబూ. నాకు నిద్ర వస్తూంది" అంది కళ్యాణి గోముగా.

"ఆ విషయం అడిగే ముందు నా గురించి ముందుగా నీకు కొన్ని నిజాలు చెప్పాలి. నువ్వు విని సరిగ్గా అర్థం చేసుకుంటావనే నమ్మకం నాకుంది. యౌవనం తొలి మెట్టులో ఉండగా చాలా మంది తప్పులు చేస్తారు. పొంగుతూ ఉన్న పరువాలు, ఉద్రేకం ఒక్కోసారి మనిషిని తప్పు దోవ పట్టిస్తాయి. పాపం చేస్తున్నది తప్పు అని తెలుసుకునే లోపల ఆ తప్పు కాస్తా జరిగిపోతుంది. ఆ తరవాత బాధతో కన్నీళ్ళు కార్చడం, పశ్చాత్తాప పడటం—ఇవన్నీ మామూలే.

"కాలేజీలో అడుగు పెట్టిన కొత్తల్లోనే నేను రాధ అనే అమ్మాయిని ప్రేమించాను. ఆమెనే పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాను. ఆ ధైర్యంతో మా ప్రేమ హద్దులు దాటింది. మేమిద్దరం పెళ్ళి కాకపోయినా, ఒకరిలో ఒకరం ఏకమయ్యాం. వయసు పెట్టిన ఆరాటానికి అపరిపక్వమైన మా మనసులు లొంగి పోయాయి. ఆమెను గాఢం

చెయ్యాలనే దురాలోచన నాలో ఏ కోశానా లేదు. కానీ, భగవంతుడే నా రాధను నాకు దూరం చేసి, నన్ను అన్యాయం చేశాడు.

"కళ్యాణీ, నా జీవితంలో సగభాగానివైన నీ దగ్గర ఏదీ దాచడం నా కిష్టం లేదు. అందుకే ఈ రోజు ధైర్యం చేసి ఈ విషయాన్ని నీతో చెబుతున్నాను. మనిద్దరం ఒకటయ్యాక మన మధ్య ఎలాంటి అరమరికలు ఉండకూడదు. ఏమంటావ్?" అని కాసేపు మౌనం వహించాడు శేషగిరి.

శేషగిరి చెప్పినదంతా ఒక కట్టు కథ అని కళ్యాణికి తెలీదు. తన భర్త జీవితంలో అలాంటి ప్రేమ ఘట్టం ఒకటి ఉందన్న సంగతి ఆమె ఎప్పుడూ ఊహించలేదు. అతను చెప్పిన విషాద గాథ విన్నాక ఆమె మనసు ఒకింత బాధతో నిండిపోయింది. తన భర్త ఎంతో మంచివాడు కాబట్టే మనసు విప్పి ఆ విషయాన్ని తనతో చెప్పాడు అనుకుంది కళ్యాణి అమాయకంగా.

"కళ్యాణీ, నా కథంతా విన్నావుగా? ఇప్పుడు నువ్వు చెప్పు, నేను వింటాను.




మన పెళ్ళి కాక ముందు నువ్వు ఎవర్ని ప్రేమించావు? నీ ప్రేమను పొందిన ఆ అదృష్టవంతుడు ఎవరు? అతని పేరేమిటి? మీ ఇద్దరికి ఎలా పరిచయ మయింది? నీ ప్రేమ కథ వినాలని నా కెంత కుతూహలంగా ఉందో తెలుసా! చెప్పు, కల్యాణీ, నే నేమయినా అను కుంటానేమో అనే సంశయం నీకు వద్దు," మనసులో ఉద్దేశం బయట పెట్టాడు శేషగిరి.

తన భర్త ఏ ఉద్దేశంతో అలా అడిగాడో కళ్యాణికి అర్థంకాలేదు. నిజా నికి ఆ ప్రసంగం ఆమెకు బొత్తిగా నచ్చలేదు. అందుకే ఎలాంటి సమా ధానమూ ఇవ్వక మౌనంగా ఉండి పోయింది. కళ్యాణి మౌనం శేషగిరికి కొంత నిరుత్సాహాన్ని కలిగించింది. అయినా, తన ప్రయత్నాన్ని మానుకోలేదు అతను. ఏదో ఒక సమాధానం చెప్పి తీరాలని పట్టుబట్టాడు.

కళ్యాణి మనసులోనే ఒక నిర్ణయానికి వచ్చి, "నే నెవర్నీ ప్రేమించలేదు" అని చెప్పి ఊరుకుంది.

"నువ్వు ఎవర్నీ ప్రేమించలేదనే

అనుకుందాం. కానీ, నిన్ను ప్రేమించిన వాళ్ళు ఎవరైనా ఉండచ్చుగా?' వెంటనే అడిగాడు శేషగిరి.

"ఏమో! ఆ సంగతి నా కెలా తెలుస్తుంది?"

"అలా అని తప్పించుకో చూస్తున్నావేమో! అదేమీ కుదరదు. అపరంజి బొమ్మలా ఉన్న నిన్ను ఎవరూ ప్రేమించలేదంటే నమ్మడానికి నేనేం వెర్రివాణ్ణి కాదు. నాతో దాగుడుమూత లాడాలని చూడకు. స్పోర్టివ్‌గా తీసుకుని నిజం చెప్పు. నిన్ను ప్రేమించాలని చాలా మంది ప్రయత్నాలు చేశారు కదూ?"

శేషగిరి పిచ్చి ధోరణి చూస్తుంటే కళ్యాణికి అతణ్ణి సరదాగా ఆట పట్టించాలన్న కోరిక కలిగింది.

"మీరు ఊహించింది చాలా కరెక్ట్. 'హాయ్, బ్యూటీ! హల్లో, స్వీటీ' అని నా అందాన్ని మెచ్చుకున్న వాళ్ళు, లిఫ్ట్ ఇమ్మంటారా? మిస్ అని వెంటపడి ప్రాధేయపడినవాళ్ళు, బాడీ గార్డుల్లా నన్ను సురక్షితంగా ఇల్లు చేర్చిన వాళ్ళు, తల్లక్రిందులా నా కోసం తపసు చేసిన వాళ్ళు — ఒకరన్న మాటేమిటి — నా ప్రేమను పొందాలని చాలా మంది చాలా ప్రయత్నాలు చేశారు" అని నవ్వుతూ కొంటెగా బదులిచ్చింది కళ్యాణి.

"గుడ్! మరి వాళ్ళందరిలో ఎవరు నిన్ను ఎక్కువగా ఆకర్షించారు? ఐ మీన్ ... నీ దృష్టిలో మంచిగా నిలిచిన వాడు..."

"అతని పేరు నాకు సరిగ్గా గుర్తు లేదు. కానీ, అన్ని విధాలా అతను మీలాగే ఉంటాడు. మీకు మల్లే అతనిదీ ఉంగరాల జుత్తే. అతని నవ్వు కూడా అచ్చం మీ నవ్వులాగే ఉంటుంది ..." అని ఇంకా ఏదో చెప్పబోతున్న కల్యాణికి అడ్డు వచ్చి, "ఇంతలా వర్ణిస్తున్నావంటే ... అతణ్ణి నువ్వు ప్రేమించే ఉంటావ్ అవునా?" అన్నాడు శేషగిరి నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపేద్దామన్న ఉద్దేశంతో, "అవును, నిజమే! నేను అతణ్ణి ప్రేమించాను. మే మిద్దరం పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాం. కానీ, పరిస్థితులు అనుకూలించక అతను మరొకామెను చేసుకున్నాడు. నేను మిమ్మల్ని చేసుకున్నాను. కథ కంచికి, మనం నిద్రాదేవి ఒడిలోకి" అని ఆవులిస్తూ మంచం మీద వాలిపోయింది కళ్యాణి.

శేషగిరి మనసులోని అనుమానం ఒక్కసారిగా భగ్గుమంది.

అంతర్లీనంగా అతనిలో ఒక విధమైన సంఘర్షణ మొదలయింది. అమాయకంగా నిద్రపోతున్న కళ్యాణిని చూస్తూ ఆ రాత్రంతా అతను అశాంతితో గడిపాడు.

* * *

మార్చి, 27

ఈ రోజు మా క్లాసు ఫేర్‌వెల్ పార్టీ జరిగింది. పార్టీ ముగిశాక మా క్లాసు అమ్మాయి లందరం కలిసి 'బ్లోహాట్-బ్లోకోల్డ్' పిక్చరుకి వెళ్ళాం. అంత ఘోరమైన సినిమా నే నెప్పుడూ చూడలేదు. హీరో, హీరోయిన్లు క్రిందా మీదా పడి దొర్లడం, ముద్దులు పెట్టుకోవడం ... అంతా ఒకటే శృంగారం. సుధ, మాలతి, సరోజిని — వీళ్ళందరికీ ఆ సినిమా ఎంతగానో నచ్చిందట. నాకు మాత్రం సినిమా చూస్తున్నంతసేపూ సిగ్గుతో ఒళ్ళంతా చచ్చినట్టయింది. ఎప్పుడూ లేనిది విపరీతమైన తలనొప్పి కూడా పట్టుకుంది. అలాంటి సినిమాలు ఇంకెప్పుడూ చూడకూడదని ఇంటికి వచ్చాక చెంపలేసుకున్నాను.

శేషగిరి డైరీ మూసి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

ఆ రోజు ఆదివారం.

చీకటిని చూసి వెలుగు భయపడి పారిపోతున్న సంధ్య వేళ.

వెన్నెల కురిపించే చంద్రుడు ఎక్కడో మబ్బుల్లో ఇరుక్కుపోయాడు. అక్కడక్కడా మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలు దారితప్పినపక్షుల్లా ఉన్నాయి. హోరుమంటూ దూసుకు వస్తున్న కెరటాలు ఒడ్డున పడి, విరిగి పోతున్నాయి. చుట్టూరా ట్యూబులైట్లు వెలుగుతున్నా, బీచి వెలవెల పోతున్నట్టుంది.

ఆ సాయంత్రం కళ్యాణితో బీచికి వచ్చిన శేషగిరి మనసులోకూడా వెలితి కనిపిస్తోంది. ఏదో చెప్పరాని ఆవేదన అతనిలో ఉన్న కాస్తంత ఉత్సాహాన్ని అణిచి వేస్తోంది. ఎక్కడో గుండె దొలుల్లో పుట్టుకొస్తున్న వేడి సెగలు అతని మెదడుని కాలుస్తున్నాయి.

ఆ రోజు కళ్యాణి వినిపించిన ప్రేమ కథ శేషగిరిని పదేపదే బాధిస్తోంది. ఆ విషయాన్ని సామాన్యంగా తీసుకుని అతను మరిచి పోలేకపోతున్నాడు. అప్పుడప్పుడే నీడ లేవో అతని కళ్ళ ముందు కదులుతూ అనుక్షణం అతణ్ణి కంపర పెడుతున్నాయి.

శేషగిరి జీవితంలో దొర్లిన వెన్నో రకాల అనుభవాలు — కళ్యాణి శీలాన్ని శంకించేలా చేస్తున్నాయి.

'పెళ్ళి కాకముందు ఎవరినో ప్రేమించానని కళ్యాణి ఒప్పుకుంది. అతను ఎలాంటి వాడు? కళ్యాణితో అతను ఏ విధంగా ప్రవర్తించాడు? కళ్యాణి అతనితో గడిపిన జీవితం ఎటువంటిది? వాళ్ళిద్దరూ ఎలాంటి అనుభవాలకు లోనయ్యారు?..'

అలాంటి సందేహా లెన్నో శేషగిరి మనసుని వేధించాయి. వాటన్నిటికీ సమాధానాలు దొరికేవరకు అతను ప్రశాంతంగా నిద్ర పోయేలా లేదు.

'కళ్యాణి నోటి నుండి నిజం రాబట్టే వరకు తను ఎంతో తెలివిగా ప్రవర్తించాలి' అని మనస్సుని ఓదారు హెచ్చరించి కళ్యాణి వైపు దృష్టి మరల్చాడు.

ఎంతో హాయిగా కూర్చుని చిన్న పిల్లలా ఆమె ఇసుకలో పిచ్చిక గూళ్ళు కడుతూ ఉంది. ఆ మసక వెలుతురులో ఆమె ముఖం అందంగా, అమాయకంగా వెలిగిపోతోంది. ఆమె కాటుక కళ్ళు నిర్మలంగా, నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఆ క్షణాన ఆకాశంలో చందమామ కనిపించని లోటు తీర్చినట్టుంది కళ్యాణి.

తనలో లేని ఉత్సాహాన్ని తెచ్చుకుని, "కళ్యాణీ, ఈ రోజు నువ్వు చాలా అందంగా కనిపిస్తున్నావు. ఒకసారి గట్టిగా ముద్దు పెట్టుకోవాలన్నంత ముద్దొస్తున్నావు" అన్నాడు శేషగిరి.

'ముద్దుగా కవిత్వం మీకు బాగానే వస్తుందే. సినిమాలకు రాయండి, నాలుగు డబ్బులయినా వస్తాయి" అంది కళ్యాణి.

"నాకే కాని కవిత్వం వస్తే మున్ముందుగా సినిమాలకు అమ్ముకోను, కళ్యాణి. నీ అందచందాలని అందంగా వర్ణించి కవిత్వపు విలువల్ని పెంచుతాను. కవిత్వానికే సరికొత్త అర్థాలను సృష్టిస్తాను. . ." అంటున్న శేషగిరికి అడ్డు వచ్చి, "ఏమండోయ్, అండి. ఈ రోజు మీ ఒంట్లో బాగా లేదా ఏమిటి? మీరు మాట్లాడుతున్నది అదేదో కొత్త భాషలా ఉంది. నా కేమీ అర్థం కావడం



దేశాన్ని ముందుకు నడిపించడంలో, సమాజాన్ని నవనవోన్మేషం గావించడంలో యువత మీద చాలా బాధ్యత ఉంది. అటువంటి యువత లోని ఉత్సాహాన్ని, నాయకత్వ సామర్థ్యాన్ని వెలికి తీసి, వారిలోని ఔన్నత్యాన్ని ఉద్దీపింప చేసే మహా సంకల్పంతో ప్రారంభించిన సంస్థ జేసీస్.

ఈ సంవత్సరం ప్రతిభావంతుడైన యువకుడుగా ఆంధ్రప్రభ గ్రూప్ పత్రికల ప్రత్యేకాధికారి శ్రీ ఆర్. రామకృష్ణన్‌ను వారు ఎన్నుకున్నారు.

ఇటీవల జంట నగరాల జేసీస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో 'యువతిరానికి ప్రతినిధి' గా అభినందిస్తూ శ్రీ రామకృష్ణన్‌ను సన్మానించారు.

శ్రీ అశోక్ జైసారత్ సన్మానపత్రం సమర్పించి శ్రీ రామకృష్ణన్ సేవలను ఘనతను కొనియాడారు.

హైదరాబాదు జేసీస్ మాజీ అధ్యక్షుడు శ్రీ సి. ఎస్. జాలా శ్రీ రామకృష్ణన్‌కు "జేసీస్" అవార్డు ప్రదానం చేశారు.

తనకు జరిపిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ మద్రాసు మాజీ షెరీఫ్ శ్రీ రామకృష్ణన్ యువజనంలో దాగి ఉన్న ఉన్నతాదర్శాలను, సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపించే నాయకత్వ లక్షణాలను వెలికి తీసి, పెంపొందించడానికి జేసీస్ చేస్తున్న బహుముఖ సేవను అభినందించారు. దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి నిర్మాణాత్మకంగా కృషి చేయాలని ప్రబోధించారు.

ప్రథమంలో జేసీస్ అధ్యక్షుడు శ్రీ రజ్‌ఖత్తర్ స్వాగతం పలికారు. శ్రీ అరుణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. *

లేదు. మీ కబుర్లు ఇంతటితో ఆపేసి, మాటల్లో సరదాగా కబుర్లేమయినా చెప్పండి" అంది కళ్యాణి.

"నాకు నీలా తియ్యగా కబుర్లు చెప్పడం రాదు. అందుచేత ఆ కబుర్లేవో నువ్వే చెప్పు. నేను 'ఊ' కొడతాను. మధ్యలో నాకు కావాలనిపిస్తే ఇలా... ముద్దులు పెట్టుకుంటాను." కళ్యాణి ముఖాన్ని దగ్గరకు తీసుకుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు శేషగిరి.

"అబ్బ, ఇదేం పాడు బుద్ధండీ. ఎవరయినా చూస్తే ఏం మర్యాదగా ఉంటుంది? చెప్పండి. ఇంకెప్పు డయినా ఇలా చేశారో నాకు చాలా కోపమొస్తుంది. అప్పుడు మీతో అసలు నీడకే రాను, తెలుసా" అంది కళ్యాణి చిరుకోపం ప్రదర్శిస్తూ.

"నీ మాటలు వింటుంటే రాధ గుర్తు కొస్తుంది, కళ్యాణీ. అప్పట్లో రాధ, నేను తరచు బీచికి వస్తుండే వాళ్ళం. ఇప్పుడు మనం కూర్చున్న చోటే ఎన్నో సార్లు కూర్చున్నాం. నా ఒడిలో పడుకుని, నా కళ్ళలోకి చూస్తూ రాధ తియ్యగా కబుర్లు చెప్పేది. ఆమె మాటలు వింటూనే మధ్య మధ్య ఆమె పెదాల మీద దాడి జరిపేవాడిని. అలాంటి సమయాల్లో రాధ ఇందాక నువ్వు ప్రేమగా మందలించి నట్టే మందలించేది. అందంలో నైతేనేమి, గుణంలో నైతేనేమి రాధకు, నీకు చాలా పోలికలు ఉన్నాయి, కళ్యాణీ" అన్నాడు శేషగిరి తగ్గు స్వరంలో.

"మీ రాధ పురాణం మీ దగ్గిరికి పెట్టి వినుకోండి. అప్పుడు మీ రేం చేస్తారు?. . ."

"ఏం చేస్తానా?..." అని క్షణం ఆలోచించి, "ఆమెనుకూడా పెళ్ళి చేసు కుంటాను" అన్నాడు శేషగిరి తమాషాకి.

"చేసుకోండి. రాధను కాకపోతే మరో దానిని చేసుకోండి.ఎవరు అడ్డొచ్చారు?" అని మోకాళ్ళ మీద ముఖం ఆన్చి, బుంగ మూతి పెట్టింది కళ్యాణి.

శేషగిరి కాసేపు మౌనం వహించాడు. తన మెదడులో గజిబిజిగా ఉన్నఆలోచనల్ని పొందికగా పేర్చుకున్నాడు. కళ్యాణి చేత నిజం మాట్లాడించాలని తెలివిగా అతను సంభాషణ మార్చాడు.

"రాధ మీద నీకు చాలా కోపం ఉన్నట్టుందే. సరేలే, ఆ విషయం వదిలేసి ఇంకేమైనా మాట్లాడుకుందాం. . .ఆ అన్నట్టు, నీ కో బాయ్ ఫ్రెండ్ ఉండే వాడని చెప్పావుగా. అతను ఎప్పుడయినా నిన్ను ముద్దు పెట్టుకున్నాడా?" అడిగాడు శేషగిరి ఎంతో మామూలుగా

శేషగిరిని ఉడికించడానికి భలే అవకాశం దొరికింది అనుకుని, "అవును, ముద్దు పెట్టుకున్నాడు. ఏం?. .. మీ రాధను మీరు ముద్దు పెట్టుకోగా లేనిది నా కృష్ణుడు నన్ను ముద్దు పెట్టుకుంటే తప్పా?" అంది కళ్యాణి చిలిపిగా కళ్ళు కదిలిస్తూ.

శేషగిరి ఏడుపు ముఖం పెడితే చూడాలనిపించింది కళ్యాణికి.

"కృష్ణుడు అంటున్నావు. అతని పేరు కృష్ణారావా?" ఆత్రతగా అడిగాడు శేషగిరి.

"అతని పేరు కృష్ణారావూ కాదు, రామారావూ కాదు. కానీ నా దృష్టి లో మాత్రం అతను కృష్ణుడే. ఆ అల్లరికి, ఆ చిలిపితనానికి కృష్ణుడి కేమీ తీసి పోడు" అంది కళ్యాణి, వస్తున్న నవ్వుని పెదాల వెనక బంధిస్తూ.

"అయితే అతను నిన్ను చాలా సార్లు ముద్దు పెట్టుకున్నా డన్నమాట."

"అన్న మాటేమిటి. ఉన్న మాటే. లెక్కలేనన్ని సార్లు పెట్టాడు. ఇందాక మీరు పెట్టారే. . . ముద్దు-అలాగే" అంది కళ్యాణి 'ముద్దు' అన్న మాటను నొక్కి పలుకుతూ.

శేషగిరి గుండెల్లో ఒక్కసారిగా పెను మంటలు లేచాయి. అతని మెదడు నిండా ముళ్ళు గుచ్చుకున్నాయి. అతని అణువణువులో బాధ రగులుకుంది.

ఆ క్షణమే కళ్యాణి పీక నులిమేసి సముద్రం లోకి విసిరేద్దాం అన్నంత ఆగ్రహం కలిగింది శేషగిరికి. కానీ, ఎంతో నిగ్రహం మీద ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

* * *

జూలై—13

'సుధ మళ్ళీ తప్పటడుగు వేసింది. గుడ్డిగా ఎవరినో నమ్మి గర్భం దాల్చింది. అబార్షన్ కోసం వాళ్ళ అమ్మా నాన్నా ఆమెను శోభా క్లినిక్‌లో చేర్పించారు. సాయంత్రం లలిత వచ్చి చెప్పేవరకు ఈ సంగతు లేవీ నాకు తెలీవు. ఒకసారి వెళ్ళి సుధను చూసి వద్దామని లలిత అంది. ఎందుచేతనో నాకు వెళ్ళాలనిపించ లేదు. వెళ్ళి కనిపిస్తే మాత్రం ఏం ప్రయోజనం? నిప్పు అని తెలిసి చేతులు కాల్చుకునే అవివేకుల్ని ఎవరూమార్చలేరు. సుధలా ఎప్పటి కప్పుడు తప్పులు చేసే వాళ్ళని దేవుడుకూడా క్షమించలేడు. ఇకమీదట సుధతో తిరగడం మానుకోవా లని నిశ్చయించుకున్నాను.'

డైరీ మూసి గతాన్ని మరో సారి తెరిచాడు శేషగిరి.

ఆ రోజు రాత్రి ధారాపాతంగా వర్షం కురుస్తోంది. ఉరుములు, మెరుపులు ఆకాశాన్ని చీల్చి చెండాడుతున్నాయి. హోరున వీచే గాలిధాటికి నిలవలేక చెట్లూ చేమా పిచ్చిగా అరుస్తున్నాయి. ఎటు చూసినా చిక్కని చీకటి అలుముకుని ఆ రాత్రి అతి భయంకరంగా ఉంది.

గదిలో వెలుగుతున్న కొవ్వొత్తి గాలికి రెపరెపా కొట్టుకుంటూంది. ఏ క్షణా న్నయినా అది ఆరిపోయి ఆ గదిని చీకటి మయం చేసేలా ఉంది.

ఓ గంట సేపటి నుండి శేషగిరి అదేపనిగా సిగరెట్లు కాలుస్తున్నాడు. అతని మెదడులో ఏవేవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అర్థరహిత మైన అనుమానాలు అతని మనసుని పట్టి పీడిస్తున్నాయి.

తను అనుకున్నంత అమాయకురాలు కాదు కళ్యాణి. ఈమెను అర్ధాంగిగా ఎన్నుకోవడంలో తను చాలా తప్పు చేశాడు. తొందరపడి మోసపోయాడు.

పెళ్ళి కాక ముందే కళ్యాణి తన మనసుని ఎవరికో అర్పితం చేసింది. అతని ముద్దుల లోని తియ్యదనాన్ని, కౌగిలి లోని వెచ్చదనాన్ని ఎన్నో సార్లు చవి చూసినట్టు తనే ఒప్పుకుంది. అంత దూరం వెళ్ళాక ఆడది కాలు జారలేదంటే ఎవరు నమ్మినా శేషగిరి మాత్రం నమ్మడు.అలాంటి విషయాల్లో అతనికి ఎంతో అనుభవం ఉంది.

అందుకే శేషగిరి కళ్యాణిని నమ్మలేక పోతున్నాడు. ఆమె శీలాన్ని, పాతివ్రత్యాన్ని శంకిస్తున్నాడు.


కళ్యాణిని ముద్దులతో ముంచెత్తిన 'అతను' కళ్యాణిని ఒక్కసారయినా అనుభ వించి ఉండాలి. ఆ కలయికలో ఉన్న ఆకర్షణ అలాంటిది. అది స్త్రీ పురుషుల నిద్దరినీ బంధించి వేస్తుంది. వారిద్దరి మధ్య ఉన్న దూరాన్ని దగ్గర చేస్తుంది.

కళ్యాణి నోటితోనే ఏదో విధంగా నిజం చెప్పించాలి.ఆతరవాత ఆమెను...? శేషగిరి ఆలోచనలు అక్కడితో ఆగి పోయాయి.

తన గుండెల మీద తల ఆన్చి కాలు తున్న కొవ్వొత్తి కేసి ఏదేకంగా చూస్తున్న కళ్యాణితో, "ఏమిటి, కళ్యాణీ! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అన్నాడు శేషగిరి.

"అబ్బే! ఏమీ లేదు. ఆ రోజు కూడా ఇలాగే మీ గుండెల మీద పడుకుని ... మీ చల్లని కౌగిలిలో తృప్తిగా కన్ను మూయాలని ఉంది" అంది కళ్యాణి అమాయకంగా.

చాలా మంది భార్యలు తమ భర్తల ఎదట అప్పుడప్పుడూ ఇలాగే పాతి వ్రత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఆ మాటల్ని నమ్మేసి, భార్యను ఇంకా గాఢంగా గుండెలకు హత్తుకుని మురిసి పోతుంటారు భర్తలు. అంతేకానీ, వాళ్ళలో నిజంగా ఏమాత్రం పాతివ్రత్యం ఉందో తెలుసుకోవాలని ప్రయత్నించరు ఆ సెంటిమెంటల్ ఫూల్స్! ... భార్య మాటలు విన్నాక శేషగిరి మనసులో కలిగిన ఆలోచనలు ఇవి.



ప్రసిద్ధ కవి శ్రీ బోయి భీమన్న రచించిన "శివాలికలు" కావ్యాన్ని ఇటీవల హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో శ్రీ ఎల్. మాలకొండ య్యకు అంకితం ఇచ్చినప్పటి ఫోటో. సభకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షత వహించారు. శ్రీ దివాకర్ల వెంకటావధాని కావ్యాన్ని ఆవిష్కరించారు. శ్రీ నారాయణరెడ్డి, శ్రీమతి లత ప్రసంగించారు. శ్రీ జె. బాపురెడ్డి స్వాగతం పలికారు. శ్రీమతి హైమవతి వందన సమర్పణ చేశారు.

ఇంతకు ముందు తన గుండెలమీద వాలి, తన కౌగిట్లో కరిగిన ఎంతో మంది అమ్మాయిలు కూడా అలాగే మాట్లాడారు. మరి, వాళ్ళంతా ఏమయ్యారు ఇప్పుడు? ... మరో మగవాడి గుండెల మీద పడుకుని ఇలాంటి కబుర్లే చెబుతూంటారు.

శేషగిరికి కూడా నటించడం బాగానే వచ్చు. ఓ క్షణం ఆలోచించి, "ఛ! ఏమిటా మాటలు, కళ్యాణీ! నిన్ను దూరం చేసుకుని నేనుమాత్రం బ్రతకగలనా? ... నువ్వు లేని లోకంలో నేను జీవించి ఉండడం అసంభవం" అని కళ్యాణిని గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు.

ఆ తర్వాత కొద్ది క్షణాలు ఆ గదిలో వేడివేడి నిట్టూర్పులు తప్ప ఇంకేమీ వినిపించలేదు.

రిలీఫ్ కోసం శేషగిరి మళ్ళీ సిగరెట్ తీసి వెలిగించాడు. అలిసిపోయిన కళ్యాణి భర్త గుండెల మీదే పడుకుని విశ్రాంతి తీసుకొంటూంది. శేషగిరి మునివేళ్ళతో కళ్యాణి తలను నిమురుతూ, "కళ్యాణీ! ఈ చీకటి రాత్రి, బయట ఆ గాలివాన, క్షణం క్రితం నీతో పొందిన అనుభవం— ఇవన్నీ ఎంత వద్దనుకున్నా రాధను గుర్తుకు తెస్తున్నాయి. ఆ నాటి రాత్రి ఇంతకన్నా చీకటిగా, చలిచలిగా ఉంది. బయట ఇలాగే జోరున వర్షం పడుతూంది. గాలి కూడా ఉధృతంగానే వీస్తూంది. ఆ సాయంత్రం ఏదో పనిమీద నా గదికి వచ్చిన రాధ ఆ రాత్రంతా నాతోనే ఉండిపోవాల్సి వచ్చింది. అప్పటి వాతావరణం అనుకోకుండా మా ఇద్దరినీ ఒకటి చేసింది. మొదటిసారిగా రాధ, నేను ఎన్నో మధురమైన అనుభవాలు చవి చూశాం ఆ రాత్రి. మేము చేసిన పని తప్పుగా తోచలేదు నాకు. మా స్థానంలో మరెవరు ఉన్నా ఆ రాత్రి ఆ విధంగానే గడిచేది. తలచుకుంటే అదంతా ఒక కలేనేమో అనిపిస్తుంది ఇప్పుడు". స్వగతంలా అన్నాడు శేషగిరి.

పోయిన రాధను తలచుకుని తన భర్త బాధపడుతున్నాడని కళ్యాణి అనుకుందే కానీ, ఏ ఉద్దేశంతో ఆ కథను అతను మళ్ళీ కొనసాగిస్తున్నాడో ఆమెకు అర్థం కాలేదు.

కొద్ది క్షణాల మౌనం తర్వాత, "నువ్వేమీ మాట్లాడవేం, కళ్యాణీ! ఈ చీకటి రాత్రిని చూస్తుంటే నీకేం గుర్తుకొస్తున్నాయి? చెప్పని అనుభవాల వంటివి ఏమన్నా ...?" అర్థోక్తిలో ఆపేశాడు శేషగిరి.

గదిలో అప్పటివరకు రెపరెపా కొట్టుకుంటున్న కొవ్వొత్తి గాలి వేగానికి ఆరిపోయింది. గదిలో ఉన్న వెలుగు నంతటినీ ఒక్క సారిగా చీకటి మింగేసింది. శేషగిరి ముఖంలో మారిన రంగులు, కళ్ళల్లోని భావాలు కళ్యాణికి కనిపించడం లేదు.

"మీ ఉద్దేశం నా కర్థం కాలేదు" అంది కళ్యాణి సంశయంగా.

"ఐ మీన్ ... నువ్వు, నీ బాయ్ ఫ్రెండ్ కలిసి ఎప్పుడన్నా అనుకోని పరిస్థితుల్లో ఏకమయ్యారా? అని." భావాన్ని స్పష్టం చేశాడు శేషగిరి.

భర్త అన్న మాటలకి అప్రతిభురాలయింది కళ్యాణి. ఆమె గుండెలు ఎప్పుడూ లేనంత వేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టాయి. ఆమె శరీరంలో ఓ విధమైన భయం, వణుకు పుట్టుకొచ్చాయి. భర్త వెలిబుచ్చిన సందేహానికి ఏ విధమైన సమాధానం ఇవ్వాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయింది కళ్యాణి.

"మాట్లాడవేం, కళ్యాణీ! సిగ్గు ముంచుకొచ్చిందా? నే నేమన్నా అనుకుంటానని సంశయిస్తున్నావా? ... పరవాలేదు, చెప్పు."

"మీ కా అనుమానం ఎందుకు కలిగిందో నాకు తెలీదు కానీ, మీరు ఊహిస్తున్నట్టు నా కెవరూ బాయ్ ఫ్రెండ్స్ లేరు" అంది కళ్యాణి గొంతు పెగుల్చుకుని.

"నీకు అబద్ధాలు కూడా తెలుసన్న మాట! నీ కృష్ణుడితో సాగించిన ప్రేమాయణం ... నీ పెదాల మీద అతని ముద్దుల వర్షాలు ... అవన్నీ అప్పుడే మర్చిపోయావా?"

"మీ మీద ఒట్టేసి చెబుతున్నాను, నన్ను నమ్మండి. మిమ్మల్ని సరదాగా ఆట పట్టించాలని ఏదో వాగాను తప్ప, అవేవీ నిజాలు కావు. మీరు అనవసరంగా నన్ను అనుమానిస్తున్నారు."

"నాలాగే నువ్వూ నిజం ఒప్పేసుకుంటే నీ మీద నాకు అనుమానం ఎందుకు వస్తుంది, చెప్పు? పెళ్ళికి ముందు రాధతో నేను గడిపిన జీవితం గురించి నీకు చెప్పలేదా? అలాగే, నీ జీవితంలో దొర్లిన అనుభవాల్ని దాపరికం లేకుండా నాతో చెప్పమన్నాను. నువ్వు చెప్పే నిజం భరించలేక నిన్నెక్కడ దూరం చేస్తానో అని నీ భయం. అంతేనా?"

"నేను నిజమే చెబుతున్నాను. నా మాట నమ్మండి. మిమ్మల్ని తప్ప నే నెవర్నీ ప్రేమించ లేదు. అపవిత్రమైన పనేదీ చెయ్యలేదు" అంది కళ్యాణి కంపిస్తున్న పెదాలతో.

"నన్ను వెర్రివాణ్ణి చెయ్యాలని చూడకు, కళ్యాణీ అతణ్ణి నువ్వు ప్రేమించావని అన్నావు. అతని ముద్దులతో పరవశించావని ఒప్పుకున్నావు. అవునా? ఆ తర్వాత ఏం జరిగి ఉంటుందో నేను ఊహించుకోగలను. పెళ్ళికాకముందు అలాంటి అనుభవాలు చాలా మందికి ఉంటాయి. నా లాంటి వాళ్ళు ధైర్యం చేసి పైకి చెప్పేస్తారు. నీ లాంటి పిరికి వాళ్ళు చెప్పడానికి భయపడతారు. నాకు కావలసింది నిజం. ఆ నిజం నిప్పులా ఉన్నా, నేను తట్టుకోగలను, కళ్యాణీ! కానీ, అబద్ధం చెబితే మాత్రం నేను సహించను." శేషగిరి గొంతు కఠినంగా మారిపోయింది.

కళ్యాణి కళ్ళ నుండి నీళ్ళు చిమ్ముకొస్తున్నాయి. ఆమె గుండెలు భయంతో కొట్టుకుంటున్నాయి. భర్తను ఏ విధంగా నమ్మించాలో అర్థం కాక మౌనంగా ఉండిపోయింది.

"ఏం కళ్యాణీ, మాట్లాడవు. ఎలాంటి కట్టు కథ చెప్పి నన్ను నమ్మించాలా అని ఆలోచిస్తున్నావా? నీ కా శ్రమ అక్కర్లేదు. ఇక నువ్వేం చెప్పినా నేను నమ్మను. రేపు ఉదయమే నువ్వు నీ పుట్టింటికి వెళ్ళిపోతే చాలా సంతోషిస్తాను. జీవితంలో మళ్ళీ నీ ముఖం నాకు చూపించాలనే ప్రయత్నాలు చెయ్యకు. నా మనసు మార్చుకుని నీ కోసం పరుగెత్తుకు వస్తాననే పిచ్చి ఆశ లేవీ పెట్టుకోకు. ఇదే మన జీవితంలో చివరి రాత్రి. తెల్లారితే నువ్వెవరో ... నే నెవరో! నీ దారి నీది ... నా దారి నాది." తన నిర్ణయాన్ని వినిపించాడు శేషగిరి.

కళ్యాణి కన్నీళ్ళతో మొర పెట్టుకుంది. చేతులెత్తి ప్రార్థించింది. కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడింది. అయినా, శేషగిరి నిర్ణయం మారలేదు.

ఆ మరునాటి ఉదయమే కళ్యాణిని ఆమె పుట్టింటికి తీసుకు వెళ్ళి వదిలేశాడు.

* * *

మే, 19

'రాత్రి పడుకునే ముందు శ్రీవారు తన ప్రేమ కథ వినిపించారు. కాలేజీ రోజుల్లో ఆయన రాధ అనే అమ్మాయిని ప్రేమించారట. ఆమెనే పెళ్ళి చేసుకుందామని అనుకున్నారట. కానీ, దురదృష్ట వశాత్తు ఆమె పెళ్ళి కాకముందే అతనికి దూర మయిందట. ఆ రాధే బ్రతికి ఉంటే ఈ రోజు నా స్థానం ఇంకెక్కడ ఉండేదో కదా! కొంతమంది జీవితాలు కథల్లాగే ఉంటాయి.

పెళ్ళికాకముందు నేను కూడా ఎవరి నయినా ప్రేమించి ఉంటే చెప్పమన్నారు. నే నెవరినయినా ప్రేమించి ఉంటే కదా ఆయనతో చెప్పడానికి! ఆ మాటే అన్నాను ఆయనతో. కానీ, తనకు నా మాటమీద నమ్మకం కలగలేదు. అదే విషయాన్నిరెట్టించి అడిగేసరికి ఆయనని సరదాగా ఆట పట్టించాలని బుద్ధి పుట్టింది. అప్పటికప్పుడు ఒక చిన్న ప్రేమ కథ అల్లి ఆయనకు వినిపించాను. నిజమేననుకుని నమ్మేసి ఉంటారు, పాపం!'

జూన్, 4

'ఈ రోజు బీచిలో ఆయన మళ్ళీ రాధ విషయం కదిపారు. రాధని ఎన్నో సార్లు ఆయన బీచిలో ముద్దులు పెట్టుకున్నారట. రాధ ఒక వేళ తిరిగి బ్రతికి వస్తే ఆమెను పెళ్ళి చేసుకుంటారట. ఆయన అలా అనే సరికి నాకు భలే కోపమొచ్చింది. పక్కనున్న నన్ను మరిచిపోయి పదే పదే రాధ గురించి చెబితే నాకు కోపం రాదు మరి!

నా కోపాన్ని మానిపించడానికన్నట్టు 'టాపిక్' ఆ రోజు నేను వినిపించిన కథలోని బాయ్ ఫ్రెండ్ మీదికి మార్చారు. ఆ బాయ్ ఫ్రెండ్ నన్నెప్పుడయినా ముద్దు పెట్టుకున్నాడా? అని అడిగారు. 'అవును. చాలా సార్లు ముద్దు పెట్టుకున్నాడు' అని అన్నాను ఆయనని ఉడికించాలన్న ఉద్దేశంతో. నా మాటకి శ్రీవారు ఆముదం తాగినట్టు ముఖం పెట్టారు. ఎంతయినా మగవారు కదా! ఈర్ష్య!

నేను రిఫర్ చేసిన కృష్ణుడు ఆయనే అని తెలుసుకున్నారో లేదో!'

జూలై, 27

'నేను సరదాగా అన్న మాటల్ని ఆయన నిజాలుగా ఊహించుకుని నా శీలాన్నే శంకించారు. ఎన్ని విధాల చెప్పినా ఆయనకి నా మీద నమ్మకం ఏర్పడలేదు. ఎప్పుడో ఏదో తమాషాకి అన్న మాటలు నా జీవితాన్నే బలి తీసుకుంటాయని నే నెప్పుడూ ఊహించ లేదు.

రేపు ఉదయం నన్ను తీసుకువెళ్ళి శాశ్వతంగా పుట్టింట్లో వదిలి వేస్తారట. అదే జరిగితే ఈ లోకం నుండే నేను శాశ్వతంగా వీడ్కోలు తీసుకుంటాను.'

చేతిలో ఉన్న డైరీ మూసేసి కసిగా ఓ మూలకి విసిరేశాడు శేషగిరి.

పశ్చాత్తాపంతో అతని మనసు దహించుకు పోగా, అతని కనుకొలకుల నుండి కన్నీళ్ళు జలజలా రాలి పడ్డాయి.

ఆ కన్నీటి పొరల మధ్య ఊహ కందని వెళ్ళిపోయిన కళ్యాణి రూపం ఒకసారి లీలగా కదిలింది.

"నేను పాపిని ... మూర్ఖుణ్ణి ... హంతకుణ్ణి ..." రెండు చేతులతో నెత్తి బాదుకుంటూ పిచ్చిగా అరిచాడు శేషగిరి.

*